రైళ్ల వివరాలు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- సీఎస్ఎంటీ (ముంబాయి)
- 17.30 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - కాకినాడ (సోమ, బుధ, శుక్ర) (19.00 మంగళ, గురు, శని)
- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- కాకినాడ
- 21.00 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- నర్సాపూర్
- 22.05 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి- ఇండోర్ (ఆదివారం)

రోడ్డుకు మరమ్మతు చేయాలి



ఆలిండ్ పరిశ్రమ ఎదురుగా రోడ్డుపై ఏర్పడిన గుంత

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఆలిండ్ పరిశ్రమ ఎదురుగా ఉన్న పాత ముంబాయి జాతీయ రహదారిపై రోడ్డు ధ్వంసం అయింది. దీంతో వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో గచ్చిబౌలి నుంచి భెల్ చౌరస్తా వైపు వెళ్లే వాహనదారులతో రోడ్డు కిక్కిరిసిపోతుంది. దీంతో రోడ్డు ధ్వంసం అయిన ప్రాంతంలో వాహనాలు వేగం తగ్గి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేసి వాహనదారులకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి



నానక్‌రాంగూడ బీజేపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని బీజేపీ డివిజన్ కార్యాలయంలో అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను బీజేపీ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్‌రాందీన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహల్యాబాయి హోల్కర్ చరిత్రపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరలక్ష్మి, కిషన్, బబ్లూసింగ్, అంబన్, దేవేందర్, వినోద్, శ్యామ్, నర్సింగ్, ధీరజ్, రేవతి, చంద్రకళ, పద్మ, హేమ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల మధ్యలోకి మురికినీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు అభివృద్ధి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలసి చెరువును సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయసముద్రం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఏఈ రంజిత్, డీఈ నరేందర్, ఏఈ దివ్య, నాయకులు చిగురు శ్రీను, కిరణ్‌గౌడ్, రవిగౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



గచ్చిబౌలిలో పూజలు చేస్తున్న అర్చకుడు



సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో..



జీపీఆర్ఏ క్వార్టర్స్ ఆలయంలో..

రాయదుర్గం: హనుమంతుడి జయంతిని ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని అంజనేయస్వామికి, గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఆంజనేయ స్వామికి, ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ శ్రీహనుమాన్ ధామ్ ఆశ్రమ్ ఆలయంలో, మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాం గూడ, గచ్చిబౌలి, రాయదుర్గం, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, టెలికామ్‌నగర్‌లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజ, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఇదిలావుండగా గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో హనుమాన్ హోమం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా ఆకుపూజ, వడమాలతో అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాష్ నారాయణనగర్‌కాలనీ, మియాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్‌తో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్‌ను సన్మానించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ఆంజనేయ స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల కాలనీల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీలో..

చందానగర్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, సాంబశివారావు, బృందరావు, అంకరావు, సత్యం, రామకృష్ణ, వెంకటేష్, రవి, అప్పలరాజు, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ



జయప్రకాష్ నారాయణ నగర్ కాలనీలో..

చందానగర్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర



పాదయాత్రలో జైపాల్, జగదీశ్వర్ గౌడ్ తదితరులు

చందానగర్: మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి దేశ వ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, స్టాండింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం చందానగర్‌లో రాజ్యాంగ పరిరక్షణకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్, నాయకులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏఐసీసీ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి నేతృత్వంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్ల సంజీవరెడ్డి, మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, మహిపాల్ యాదవ్, మిరియాల రాఘవరావు, లక్ష్మీనారాయణగౌడ్, వీరేశం గౌడ్, ఉరిటి వెంకట్రావ్, మహమ్మద్ అలీ, బాష్పక, నగేష్ నాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు చేయించుకుంటున్న కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ

గచ్చిబౌలి: విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులు తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని టీజీఎస్ఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం.రామకృష్ణ సూచించారు. గురువారం కొండాపూర్ బెటాలియన్‌లో మెగా డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రమం తప్పకుండా నిర్వహించే వైద్య శిబిరాల్లో అందరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే ప్రాథమిక దశలోనే తెలిసే అవకాశం ఉందన్నారు. పోలీసులతో పాటు కుటుంబసభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.వి.రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, యూనిట్ డాక్టర్ జ్యోతిపూలే, మెగా డెంటల్ హాస్పిటల్ డాక్టర్ నేహా తదితరులు పాల్గొన్నారు.

మహిళా దక్షత సమితి విద్యా సంస్థల్లో అడ్మిషన్లు ప్రారంభం

చందానగర్: చందానగర్ గంగారంలోని మహిళా దక్షత సమితి విద్యాసంస్థలు, సుమన్ బాలికల జూనియర్ కళాశాల, విడి బజాజ్ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-2026 సంవత్సరానికి బీబీఏ కోర్సు డిగ్రీ విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-2026 విద్యా సంవత్సరానికి ఇంటర్, డిగ్రీ (దోస్త్) ద్వారా అడ్మిషన్లు జరుగుతుందన్నారు. నూతన విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పుకు అనుగుణంగా విద్యార్థులకు ఉన్నత విద్య అందించే క్రమంలో నూతన కోర్సు బీకాం కంప్యూటర్స్ రావడం సంతోషిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం విద్యా రంగంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, ఈ మార్పులకు అనుగుణంగా తమ వద్ద ఇంటర్ జనరల్ కోర్సులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్‌లో ఎంపీహెచ్ డబ్ల్యూ, ఎంఎల్‌టీ, సీఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 040 23033383లో సంప్రదించాలని ఆమె కోరారు.

రోడ్డు భద్రత, వ్యవస్థల బలోపేతంపై సమావేశం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఐనుల్ హసన్

రాయదుర్గం: మౌలిక వసతులు, సమానత్వం, న్యాయాన్ని అనుసంధానించడానికి రోడ్డు భద్రత ఒక శక్తివంతమైనదని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మాస్ కమ్యూనికేషన్ జర్నలిజం విభాగం సహకారంతో యూనిసెఫ్ ఇండియా గురువారం రోడ్డు భద్రత, వ్యవస్థల బలోపేతంపై జాతీయ మీడియా కన్సల్టేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లోతుగా ఆలోచించి సానుకూల మార్పులకు దోహదపడే జర్నలిస్టులను సిద్ధం చేయడంలో విశ్వవిద్యాలయం పాత్రను ఆయన నొక్కి చెప్పారు. సురక్షితమైన పాఠశాల, బలమైన అత్యవసర సంరక్షణ వ్యవస్థలు, అవగాహన ప్రచారాలు అన్నీ పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ శివశంకర్, ఐఎస్ఏడీఏకె సీఈఓ రామోన్‌చెసా, యూనిసెఫ్ హైదరాబాద్ చీఫ్ డాక్టర్ జెలాలెమ్‌టఫ్సె, యూనిసెఫ్ ఇండియా హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సయ్యద్ హబ్బిఅలీ, స్కూల్ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ పాల్గొన్నారు.

దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న డీఐ రమేష్ నాయుడు

మియాపూర్: దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేష్ నాయుడు వివరాల ప్రకారం.. భవానీనగర్‌కు చెందిన షేక్ షాబాజ్(22) మహమ్మద్ జహంగీర్ అలియాస్ సోహెల్(24) మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి అర్ధరాత్రి రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన క్యాబ్ డ్రైవర్లపై దాడి చేసి డబ్బులు, సెల్‌ఫోన్లు, లాక్కెళ్లేవారు. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయి. ఈ నెల 15న జైలు నుంచి బయటకు వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. మల్లాపూర్‌కు చెందిన జె.ప్రదీప్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో మదీనాగూడలోని జీఎస్ఎం మాల్ ముందు జాతీయ రహదారిపై రోడ్డు పక్కన కారు ఆపి డోర్ తెరిచి సెల్‌ఫోన్ చూసుకుంటూ కూర్చున్నాడు. షాబాజ్, సోహెల్ ఇద్దరు స్కూటీపై వచ్చి ప్రదీప్‌పై దాడి చేసి ఫోన్‌ను లాక్కొని పారిపోయారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా షాబాజ్, సోహెల్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: పేదలకు వైద్యం అందించడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆపత్కాలంలో ఆపన్నహస్తంలా ఆదుకుంటుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.2.45లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు సత్యనారాయణ, సాయిమౌనిక, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గురువారం కేంద్రంలో 600 బస్తాల ధాన్యాన్ని మిల్లుకు తరలించారు. దాదాపు 350 బస్తాలు కాంటా వేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయి. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతోంది. వావిలాల, ఊట్ల, సోలక్‌పల్లి కేంద్రాల్లో సాఫీగా సాగుతున్నాయి. కేంద్రాల వద్ద తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులో మరాడించి రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అగ్నిమాపక భద్రతపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎస్పైర్ బయోనెస్ట్ ఇంకుబేషన్ సెంటర్ ప్రాంగణంలో అగ్నిమాపక భద్రతపై అవగాహన కార్యక్రమం, మాక్ డ్రిల్‌ను గురువారం భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. అగ్నిమాపక ప్రమాదం చోటు చేసుకుంటే అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అధికారులు, ఉద్యోగులు, ఇంకుబేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమదాలు, భద్రతా పరికరాలు, ఉపశమన వ్యూహాలు, తరలింపు విధానాలపై లోతైన ప్రదర్శనలో చూపించారు. ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అగ్నిమాపక యంత్రాలు, అత్యవసర సాధనాల సరైన ఉపయోగంపై పాల్గొనేవారు ఆచరణాత్మక శిక్షణను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ఎస్పైర్ బయోనెస్ట్ ఇంకుబేషన్ సెంటర్ అధికారులు, ఉద్యోగులు, స్టార్టప్‌ల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కు చౌరస్తాలో పనిచేయని సిగ్నల్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కేబీఆర్ పార్కు చౌరస్తాలో గురువారం తెల్లవారుజామున 6 గంటల నుంచి ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి 12 గంటల వరకు కూడా సిగ్నల్ చేయలేదు. దీంతో ట్రాఫిక్ పోలీసులు తమ చేతులకు పని చెప్పాల్సి వచ్చింది. ఈ చౌరస్తా నుంచి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వీటిని నియంత్రించడం ట్రాఫిక్ పోలీసులకు నరకప్రాయంగా మారింది. చాలాసార్లు ట్రాఫిక్ పోలీసులను కాదని వాహనదారులు అడ్డదిడ్డంగా ముందుకుదూసుకుపోయారు. ట్రాఫిక్‌ను నియంత్రించలేక పోలీసులు పడ్డ బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిగ్నల్స్‌కు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు కోసం నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా కార్యాలయాన్ని కీసరగుట్ట సమీపంలో ఏర్పాటు చేయడంతో అల్లాపూర్ వాసులు వివిధ పనులపై వెళ్లాలంటే సుమారు 5 బస్సులు మారాల్సి వస్తుందని తెలిపారు. అలా కాకుండా నేరుగా బోరబండ నుంచి కానీ పర్వత్‌నగర్ నుంచి కానీ కలెక్టర్ కార్యాలయానికి ఆర్టీసీ బస్సు నడిపేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చోట మహేష్, జాకీర్, రమేష్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

ఆల్విన్‌కాలనీ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో జీహెచ్ఎంసీ అధికారుల పర్యటన



గుల్‌మోహర్‌పార్కు కాలనీ వద్ద పిచ్చిమొక్కలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది పరిశీలిస్తున్న అధికారులు



ఖాజాగూడ ప్రధాన రోడ్డులోని మ్యాన్‌హోళ్లలోకి వర్షపు నీరు వెళ్లేలా చేయిస్తున్న అధికారులు



గచ్చిబౌలి ప్రధాన రోడ్డు పక్కన మ్యాన్‌హోల్ పరిసరాల్లో వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

గచ్చిబౌలి: వర్షంతో రోడ్లపైకి నీరు వచ్చిన ప్రాంతాలను జీహెచ్ఎంసీ అధికారులు గురువారం ఉదయాన్నే పరిశీలించారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లలోని ప్రధాన రోడ్ల పక్కన ఉండే మ్యాన్‌హోళ్లలోకి వర్షపు నీరు పారేలా ఏర్పాట్లను సర్కిల్‌లోని ఈఈ జీకేడీ ప్రసాద్, డీఈ విశాలాక్షి, ఏఈ రషీద్ వేర్వేరు చోట్లలో పర్యటిస్తూ సిబ్బందితో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా మ్యాన్‌హోళ్లను సరిచేసి వర్షపు నీరు సాఫీగా పారేలా రోడ్లపై నిల్వ ఉండకుండా వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. ప్రతి మ్యాన్‌హోల్‌ను పరిశీలించిన రోడ్డుపైకి వర్షపునీరు వస్తే మ్యాన్‌హోల్‌లోకి సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లను పరిశీలించి అధికారుల పర్యవేక్షణలో చేయించారు. అధికారులు ఖాజాగూడ, నానక్‌రాంగూడ, రాయదుర్గం, గుల్‌మోహర్ పార్కు, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ పార్కు కూడలి, ఖాజాగూడ నుంచి ఎస్కే ముందు నుంచి గచ్చిబౌలికి వెళ్లే రోడ్డు, ఇందిరానగర్, ట్రిపుల్‌ఐటీ కూడలి వంటి ప్రాంతాల్లో అధికారులు పర్యటించారు.